
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



# సిట్టింగుల్లో టెన్షన్



- అధికారికంగా ఖరారు కాని అభ్యర్థుల జాబితా
- నేడు ఫైనల్ లిస్టు అంటూ తొలుత లీకులు
- రాజ్యసభ ఎన్నికల ఎఫెక్ట్‌తో వాయిదా?
- టికెట్ వస్తుందా, రాదా.. అనుచరుల్లో ఆందోళన



(కడప-ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను సీఎం జగన్ చాలా వ్యూహాత్మకంగా ఆ బురద తనకంటకుండా ఎమ్మెల్యేలకు అంటించే యత్నం చేస్తున్నట్లు వైసీపీ వర్గాలే వాపోతున్నాయి. నేను కష్టపడుతున్నా.. అయితే మీ గ్రాఫ్ బాగా లేదు. సర్వేల్లో జనాభిప్రాయం మీవైపు లేదు.. అంటూ సిట్టింగ్ ఎమ్మెల్యేలను జగన్ ఇతర ప్రాంతాలకు ట్రాన్స్‌ఫర్ చేస్తూ వస్తున్నారు. మరికొన్నిచోట్ల సమన్వయకర్తలను నియమిస్తున్నారు. ఉమ్మడి జిల్లాల్లో రాజంపేట సమన్వయకర్తగా జడ్పీ ఛైర్మన్ అమరనాథరెడ్డిని నియమించారు. వచ్చే ఎన్నికల్లో ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి మొండిచేయి చూపినట్లే. వైసీపీ అధిష్టానం ఇప్పటికే నాలుగు జాబితాలను విడుదల చేసింది. ఐదో జాబితా 25వ తేదీ అంటూ ప్రకటించింది. ఆ మేరకు సిట్టింగ్ ఎమ్మెల్యే టెన్షన్ నెలకొంది. అయితే అధిష్టానం చెప్పిన మేరకు గురువారం ఐదో జాబితా ప్రకటించలేదు. రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో తుది జాబితా ఆలస్యం అవుతుందేమోనన్న చర్చ నడుస్తోంది. దీంతో తమ ఎమ్మెల్యే ఈ సారి బరిలో ఉంటారో ఉండరో అనే ఆందోళన వారి అనుచరుల్లో మొదలైంది.

**టికెట్ ఎవరికో..**

ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో 10 అసెంబ్లీ, రెండు అసెంబ్లీ స్థానాలున్నాయి. ఇవన్నీ ప్రస్తుతం వైసీపీ చేతిలో ఉన్నాయి. అయితే కడప పార్లమెంటు పరిధిలో కొన్ని అసెంబ్లీ స్థానాలకు వ్యక్తులను మారుస్తారనే ప్రచారం సాగుతూ వచ్చింది.

- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా నంద్యాల పార్లమెంటుకు పోటీ చేయాలని చెప్పినట్లు ప్రచారం సాగింది. అక్కడ ముస్లిం కమ్యూనిటీ ఓట్లు ఎక్కువగా ఉండడం, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా అంజద్‌బాషా ఉండడంతో ఆయనతో పోటీ చేయించాలని వైసీపీ అధిష్టానం భావించినట్లు ఆ పార్టీ ముఖ్య నేత ఒకరు వెల్లడించారు. అయితే నంద్యాల నుంచి పోటీ చేసేందుకు అంజద్‌బాషా విముఖత చూపించారంటారు. కడప నుంచే పోటీ చేసేందుకు ఆసక్తి కనబరిచారంటారు. దీంతో ఆయనకు కడప అసెంబ్లీ టికెట్ కన్‌ఫర్మ్ కావడంతో మక్కా యాత్రకు పోయి వచ్చారని అంటున్నారు.
- కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి అభ్యర్థిత్వాన్ని మారుస్తారంటూ జోరుగా ప్రచారం సాగింది. రకరకాల పేర్లు వినిపించాయి. చివరికి ఆయన తనయుడు సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్‌రామాంజులరెడ్డి కూడా పోటీకి సుముఖత చూపించారని అంటారు. తనకు టికెట్ ఇవ్వాలని బావ అయిన సీఎం జగన్‌ను అడిగారని చెబుతారు. అయితే "టికెట్ నాకే కన్‌ఫర్మ్ అయింది. ఈ సారి కార్యకర్తలకు న్యాయం చేయలేకపోయాను.. నన్ను క్షమించండి.. ఈసారి మీ బాగోగుల చూసుకుంటా" అని మూడురోజుల క్రితం నిర్వహించిన కమలాపురం వైసీపీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే రవిరెడ్డి చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.
- జమ్మలమడుగు కూడా మారుస్తారని ప్రచారం ఉంది. ఇటీవల సత్యసాయి జిల్లా లేపాక్షికి ప్రధానమంత్రి మోదీ వచ్చారు. అక్కడకు వెళ్లేందుకు సీఎం జగన్ విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో కడపకు వచ్చి ఇక్కడ నుంచి హెలికాప్టరులో వెళ్లారు. కడపలో సీఎం జగన్‌కు స్వాగతం పలికేందుకు జిల్లా అధికారులతో పాటు ఎమ్మెల్యేలు వెళ్లారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు ఎమ్మెల్యేపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వైసీపీలో ప్రచారం జరిగింది. ఇది మీ ఎన్నికలు అనుకుంటున్నావా, మా ఎన్నికలు అనుకుంటున్నావా.. కలుపుకుపోవాలంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.
- మైదుకూరులో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి వయోభారం కారణంగా టికెట్ మారుస్తారనే ప్రచారం ఉంది. ఆయన కొడుకుకు టికెట్ ఇస్తారని ప్రచారం జరగ్గా కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి తన అల్లుడు, సన్‌రైజ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. ఈయనది బ్రహ్మంగారిమఠం మండలం.
- బద్వేలు ఎమ్మెల్యే సుధాను కూడా మారుస్తారని ప్రచారం సాగింది. ఇక్కడ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి టికెట్ ఇస్తారని అంటున్నారు. అయితే సుధాకే టికెట్ కన్‌ఫర్మ్ అయిందంటూ ఆమె వర్గీయులు బుధవారం బాణసంచా పేల్చారు.
- ప్రొద్దుటూరులో ఎమ్మెల్యే రాచమల్లును మారుస్తారని ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది. ఇక్కడ బీసీ వర్గానికి టికెట్ కేటాయిస్తారని అంటున్నారు. తొలుత ఎమ్మెల్సీ రమేశ్ యాదవ్ పేరు వినిపించింది. ఇప్పుడు ఆయన పేరుతో పాటు చేనేత సామాజిక వర్గానికి చెందిన కొందరి పేర్లు వినిపిస్తున్నాయి.

**రాజ్యసభ ఎన్నికల భయం**

వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలను మారుస్తూ వచ్చింది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో రాజంపేట మాత్రమే మార్పు జరిగింది. అయితే టికెట్‌ల మార్పుపై వైసీపీలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. సిట్టింగ్‌లలో మార్పు ఉండవచ్చని కొందరంటే.. కడప పార్లమెంటు పరిధిలో ఎలాంటి మార్పు ఉండదని కొందరు చెప్పుకొస్తున్నారు. అయితే జిల్లాలో ఇంతవరకు అభ్యర్థులు వీరే అని కానీ, సమన్వయకర్తలు వీరే అని కానీ ప్రకటించలేదు. ఇది వైసీపీ నేతలు, కార్యకర్తలను ఆందోళనకు గురిచేస్తోంది. కొంత మంది సిట్టింగ్‌లకు మళ్లీ మీకే టికెట్లు అని సీఎం చెప్పారని ముఖ్యనేత చెబుతున్నా.. సిట్టింగ్ ఎమ్మెల్యేలు తమకే టికెట్ అని చెబుతున్నా కేడర్ నమ్మడం లేదంటున్నారు. టికెట్ కన్‌ఫర్మ్ అయినట్లు జాబితా వస్తే తప్ప మా బాస్‌కు టికెట్ ఉంటుందో లేదోనని ఓ ఎమ్మెల్యే అనుచరులు వాపోయారు. త్వరలో రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. సిట్టింగ్‌లను మార్చి వేరే వారిని నియమిస్తే ఆ ఎన్నికల్లో ఎక్కడ వేటు వేస్తారో అనే భయం జగన్ అండ్ కోకు ఉందని చెబుతారు. మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ నుంచి అనురాధ ఎమ్మెల్సీగా గెలుపొందారు. వైసీపీకి చెందిన అసంతృప్త ఎమ్మెల్యేలు ఈమెకు ఓటువేయడంతో గెలుపొందారు. రాజ్యసభ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పుడు సిట్టింగ్‌ల స్థానంలో వేరేవారిని నియమిస్తే రాజ్యసభ ఎన్నికల్లో ఓడిస్తారేమో అనే భయం జగన్ అండ్‌కోలో ఉందంటారు. అందుకే గురువారం తుది జాబితా ప్రకటించలేదని అంటున్నారు. తుదిజాబితాలో పేర్లు వచ్చే వరకు తమకు ఆందోళన తప్పదని ఎమ్మెల్యే అనుచరులు వాపోతున్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్



# ఓటు విలువైనది

- ప్రతి ఒక్కరూ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ విజయరామరాజు

కడప (కలెక్టరేట్), జనవరి 25: ప్రజాస్వామ్య దేశంలో ఓటు చాలా విలువైనదని, ప్రతి ఒక్కరూ ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజయరామరాజు పిలుపునిచ్చారు. గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని సభాభవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గణేశ్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, ఆర్డీవో మధుసూదన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1950వ సంవత్సరం జనవరి 25వ తేదీన భారత ఎన్నికల సంఘం ఏర్పడిందన్నారు. 2011 నుంచి భారత ప్రభుత్వం ప్రతి ఏడాది జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటు హక్కును పొంది, మంచి పాలకులను ఎన్నుకునేందుకు వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో 16.16 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, వీరంతా ఓటును తమ హక్కుగా గుర్తించడంతో పాటు తమ బాధ్యతగా భావించాలన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో 70 శాతం పైగా ఓటింగ్ నమోదయిందని ఈ దఫా ఎన్నికల్లో 100 శాతం నమోదయ్యేలా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరయిన వారితో నిర్భయంగా ఓటు వేస్తామంటూ ఆర్డీవో ప్రతిజ్ఞ చేయించారు. దీనికి ముందుగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కొత్తగా ఓటుహక్కు పొందిన యువతకు ఎపిక్ కార్డులు అందజేసి, సీనియర్ ఓటర్లను సన్మానించారు.

**అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించాలి**

జిల్లాలో అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి రెవెన్యూ, రీసర్వే, మూడవ దశ ఇనామ్, అసైన్డ్‌భూములు, పీఅండ్ ఆర్డీ, ఎన్ఆర్ఈజీఎస్, జల్‌జీవన్ మిషన్, ఆరోగ్యం, వైద్యం జగనన్న ఆరోగ్య సురక్ష, కులగణన, ఎన్నికల సన్నద్ధత తదితర అంశాలపై చీఫ్ సెక్రటరీ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు జేసీ గణేశ్‌కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్ హాజరయ్యారు. సీఎస్ కాన్ఫరెన్స్ ముగిసిన తరువాత కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలను శాఖల వారీగా అన్ని అంశాలలో ముందంజలో నిలిపేలా అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాలో జరుగుతున్న కులగణనను సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు.



భారీ జాతీయ పతాకంతో ర్యాలీ

# ఆడుదాం ఆంధ్రలో గందరగోళం



క్రీడాకారులకు సంబంధించి చర్చిస్తున్న అధికారులు

కమలాపురం (కడప ఎన్జీఆర్‌సర్కిల్), జనవరి 25: కమలాపురంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం గందరగోళంగా మారింది. మండల స్థాయిలో గెలుపొందిన టీంలకు నియోజకవర్గ స్థాయిలో పోటీలు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గురువారం నిర్వహించన కబడ్డీ పోటీల్లో చెన్నూరు, కమలాపురం మండలంలోని జంబాపురం టీమ్‌లు పాల్గొనాల్సి ఉంది. అయితే జంబాపురం టీంకు సంబంధించి స్థానికులతో పాటు స్థానికేతర క్రీడాకారులు కూడా పాల్గొనడంపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. నిబంధనల ప్రకారం కమలాపురం నియోజకవర్గంలోని క్రీడాకారులు మాత్రమే పాల్గొనాలని సూచించారు. స్థానికంగా ఉన్న ఫిజికల్ డైరెక్టర్లు కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించారు. కానీ జిల్లా స్థాయి క్రీడాకారులు మాత్రం స్థానికేతరులు కూడా పోటీల్లో పాల్గొనవచ్చని సూచించారు. దీంతో చెన్నూరు మండలానికి సంబంధించిన క్రీడాకారులు, నియోజకవర్గంలో ఇతర ప్రాంతాలకు చెందిన వారు కూడా తాము ఈ పోటీల్లో పాల్గొనమని నిరసన వ్యక్తం చేశారు. ఈ అంశంపై కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామంటూ క్రీడా పోటీల్లో పాల్గొనకుండా వెళ్లిపోయారు. దీంతో అక్కడ కొంత సేపు గందరగోళం పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై స్థానిక ఎంపీడీవో జ్యోతిని వివరాలు అడిగేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరు. ఫోనులో కూడా స్పందించలేదు.

# రూ.575.93 కోట్లతో కార్పొరేషన్ బడ్జెట్

- ఖర్చులు రూ.502.76 కోట్లు
- మిగులు రూ.73.17 కోట్లు
- బడ్జెట్ సమావేశంలో ఏకగ్రీవ ఆమోదం

కడప (ఎడ్యుకేషన్), జనవరి 25: కడప కార్పొరేషన్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.575.93 కోట్లతో బడ్జెట్ రూపొందించారు. ఇందులో రూ.502.76 కోట్లు ఖర్చులు, రూ.73.17 కోట్లు మిగులు బడ్జెట్‌గా చూపారు. గురువారం కార్పొరేషన్ సమావేశ మందిరంలో మేయర్ సురేశ్ బాబు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య, బడ్జెట్ సమావేశంలో సభ్యులు ఈ బడ్జెట్‌కు ఆమోదముద్ర వేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరం సవరణ బడ్జెట్‌ను 2022-23 సంవత్సరం అంచనాలోని అంతిమ విలువ ఆధారంగా రూపొందించారు. 2023-24 సవరించిన బడ్జెట్ సాధారణ మూల ధన, అంత్య విలువ రూ.66.62 కోట్లను 2024-25 సంవత్సరం ప్రారంభ నిల్వగా చూపారు.

అలాగే రాబడి ప్రారంభ నిల్వతో సహా 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.575.93 కోట్లుగా బడ్జెట్‌లో చూపించారు. ఖర్చులకు సంబంధించి రూ.502.76 కోట్లు చూపి, మిగులు నిల్వను 73.17 కోట్లు చూపించారు.

అయితే ముఖ్యమంత్రి సొంతజిల్లా కావడంతో జిల్లా కేంద్రమైన కడప కార్పొరేషన్‌లో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. కార్పొరేషన్ పరిధిలో పలు కూడళ్ల అభివృద్ధి, కాల్వల నిర్మాణాలకు రూ.305 కోట్లు మంజూరు చేశారు. అలాగే జగనన్న కాలనీలు, దేవునికడప చెరువు సుందరీకరణకు రూ.300 కోట్లు, తాగునీటి శాశ్వత పరిష్కారానికి రూ.520 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులు ప్రభుత్వం మంజూరు చేసినప్పటికీ వీటిని బడ్జెట్‌లో చూపడంతో అంచనాలు భారీగా పెరిగాయి. అనంతరం బడ్జెట్‌పై చర్చ కొనసాగింది. పలువురు కార్పొరేటర్లు వారి సమస్యలను మేయరు, ఉప ముఖ్యమంత్రి, కమిషనరు దృష్టికి తీసుకెళ్లారు.

- కార్పొరేటరు షఫి మాట్లాడుతూ.. బడ్జెట్‌లో తాగునీటికి అధిక నిధులు కేటాయిస్తున్నామని, తాగునీటికి శాశ్వతపరిష్కారం చూపితేనే దీనికి సార్థకత లభిస్తుందని అన్నారు.
- కార్పొరేటరు సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. 2వ డివిజను అక్కాయపల్లెకు నీరు రాదన్నారు. పైపులైను వేయమని కొన్నేళ్లుగా చెబుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని, గ్రామంలో తిరగాలంటేనే భయంగా ఉంటుందన్నారు. పైపులైనుకు అయ్యే ఖర్చు తానే భరిస్తానని, త్వరితగతిన పనులు చేపట్టాలని కోరారు. దీనిపై కమిషనర్ ప్రవీణ్‌చంద్ స్పందిస్తూ కాంట్రాక్టరు పనులు చేయకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందన్నారు. ఆ కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెడతామన్నారు.
- కార్పొరేటరు సుజాత మాట్లాడుతూ.. 21వ డివిజన్ పరిధిలోని ఎర్రముక్కపల్లె సర్కిల్ అభివృద్ధికి నోచుకోలేదని, దానిని అభివృద్ధి చేయాలని కోరారు. అలాగే బుగ్గవంక సుందరీకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అనంతరం జరిగిన సర్వసభ్య సమావేశంలో మూడు అంశాలతో కూడిన అజెండాను ప్రవేశపెట్టారు. ఈ మూడు అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.






మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్.. తమ ప్రాంతానికి తాగునీరు రాదని చెబుతున్న కార్పొరేటర్ సుబ్బారెడ్డి




# గణతంత్ర వేడుకలకు ముస్తాబు

కడప (క్రైం), జనవరి 25: గణతంత్ర వేడుకల సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలోని మైదానాన్ని ముస్తాబు చేశారు. అధికారులు ఆశీనులయ్యే స్టేజీని పూలతో అలంకరించడంతో పాటు జాతీయ జెండా ఆవిష్కరరణకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్ శకటాలు ప్రదర్శించనున్నారు. అలాగే విద్యార్థులు దేశభక్తి గీతాలకు నృత్యాలు చేయనున్నారు.



పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లు

# వరి సాగుకు నీరేదీ..?



- గణనీయంగా తగ్గిన సాగు విస్తీర్ణం
- కేవలం 3638 హెక్టార్లకే పరిమితం
- కొండెక్కిన బియ్యం ధరలు
- పశుగ్రాసంపై ప్రభావం
- ఇబ్బంది పడుతున్న రైతులు

కడప(రూరల్) జనవరి 25: ఈ ఏడాది లోటు వర్షపాతంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులలో నీరు లేక వెలవెల బోతున్నాయి. దీంతో భూగర్భ జలమట్టం కూడా పడిపోవడంతో బోరుబావులు అడుగంటాయి. జిల్లా వ్యాప్తంగా బోరుబావుల కింద 750 నుంచి 1000 హెక్టార్లలో మాత్రమే వరి సాగయిందని తెలుస్తోంది. ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో దాదాపు రెండు లక్షలకు పైగా వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. వీటి కింద రబీలో 10 వేల హెక్టార్లకు పైగా వరి సాగుచేస్తుంటారు. కానీ ఈ ఏడాది భూగర్భజలాలు తగ్గిపోవడంతో 3,638 హెక్టార్లకే పరిమితమైంది. ప్రస్తుతం సాగులో ఉన్న వరిపంటకు కూడా తగినంత నీరు లేకపోవడంతో దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. ఉన్న నీటి వనరులను నమ్ముకుని సాగుచేసిన ఆరుతడి పంటలే వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండుతున్న తరుణంలో వరి పంటను ఎలా గట్టెక్కించాలో అర్థంకాక రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

**బియ్యం ధరలకు రెక్కలు**

ఈ యేడు తీవ్రమైన వర్షాభావంతో జిల్లాలో వరిసాగు దారుణంగా పడిపోయింది. పైగా అరకొరగా సాగైన పంట సైతం సక్రమంగా చేతికి అందుతుందన్న నమ్మకం లేదు. అన్ని పరిస్థితులు అనుకూలించి పంట బాగా ఉంటే ఎకరాకు ఏడెనిమిది పుట్ల వరిధాన్యం పండుతుంది. అలాంటిది నీటిఎద్దడి కారణంగా నాలుగైదు పుట్లకే పరిమితమైంది. దీంతో సన్నబియ్యం ధరలకు రెక్కలొచ్చి కొండెక్కి కూర్చొన్నాయి. మార్కెట్‌లో జిలకర మసూర ప్యాకెట్ (26 కిలోలు) రూ.1700ల ధర పలుకుతోంది. ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు.

**పశుగ్రాసంపై ప్రభావం**

జిల్లాలో వరిసాగు తగ్గిపోవడంతో ఈ ప్రభావం పశుగ్రాసంపై పడింది. పశుగ్రాసంలో వరిగడ్డి కీలకపాత్ర పోషిస్తోంది. వరిగడ్డి ఎక్కువ కాలం మన్నికతో పాటు, విరివిగా దొరికేది కావడంతో పశువుల మేతకు వాడుతుంటారు. పైగా ఇతర పశుగ్రాసం కన్నా చౌకగా ఉండడంతో నూటికి 90 శాతం మంది రైతులు వరిగడ్డినే వాడుతున్నారు. గతంలో వరిపంటను విస్తారంగా సాగుచేయడంతో వరిగడ్డి తక్కువ ధరకే లభించేది. ఈ యేడు వరిసాగు పెద్దగా లేకపోవడంతో అరకొరగా సాగైన వరిగడ్డికి రెక్కలొచ్చాయి. ఒక ట్రాక్టర్ వరి గడ్డిని రూ.10,000 నుంచి రూ.15,000ల వరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని పశువుల పెంపకం దారులు వాపోతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో ధర చెల్లిస్తున్నా వరిగడ్డి మాత్రం దొరకక పోవడంతో రైతులు పశుగ్రాసం కొరతతో ఇబ్బంది పడుతున్నారు. ఈ కరువు ఇలానే కొనసాగితే జిల్లా రైతాంగం ఆర్థికంగా కుదేలయ్యే అవకాశం ఉంది. వ్యవసాయాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టకపోతే జిల్లా ప్రజలందరికీ ఇబ్బందులు తప్పవు.

**ఆహార ధాన్యాలలో కీలకమైన వరి సాగు ఈ ఏడాది చతికిలపడింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రబీలో ఎన్నడూ లేనంతగా వరిపంట సాగు గణనీయంగా పడిపోయింది. 2023-24 రబీలో సాగు లక్ష్యం 10,669 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు కేవలం 3,638 హెక్టార్లకే పరిమితమైంది. అలాగే 2023-24 ఖరీఫ్‌లో 33,215 హెక్టార్లు లక్ష్యం కాగా కేవలం 23,108 హెక్టార్లలో మాత్రమే వరిపంట సాగుకు నోచుకుంది. ఇలా 2023-24 ఖరీఫ్, రబీ సీజన్లలో వరిసాగు తగ్గడానికి కారణం నీరు అందుబాటులో లేకపోవడమే అని అధికారులు, రైతులు పేర్కొంటున్నారు.**



దేవునికడప ప్రాంతంలో నీరు లేక దెబ్బతిన్న వరిపైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్‌ఫొటో)

## భాకరాపేట వద్ద రూ.70 లక్షలు పట్టివేత



నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

సిద్దవటం, జనవరి 25 : మండలంలోని భాకరాపేట చెక్‌పోస్టు వద్ద గురువారం వాహనాల తనిఖీలో ఎలాంటి ఆధారాలు లేని 70 లక్షల నగదును సీజ్ చేసినట్లు సిద్దవటం ఎస్‌ఐ పెద్దఓబన్న తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గురువారం తాడిపత్రికి చెందిన వెంకట నారాయణరెడ్డి తిరుపతిలో ఉన్న స్థలాన్ని అమ్మి 70 లక్షల నగదును తన వాహనంలో తీసుకుని వెళుతున్నాడన్నారు. నగదుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేశామని, డబ్బును ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ముగ్గురు పిల్లలతో కలిసి మహిళ అదృశ్యం



ముగ్గురు పిల్లలతో భార్గవి

చిన్నమండెం, జనవరి 25: మండలంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన భార్గవి అనే మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ రమేశ్‌బాబు తెలిపారు. ఆమె తల్లి కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... భార్గవి అనే మహిళ తన భర్త బతుకుదెరువు కోసం కువైత్ వెళ్లగా తన ముగ్గురు బిడ్డలతో రూపేష్ (7), చరిష్మా (5), నిషా (3) శ్రీరామ్‌నగర్ కాలనీలో ఉంటోంది. ఈనెల 23వ తేదీ సాయంత్రం 3 గంటల సమయంలో తన అత్తగారి ఊరు చాకిబండ కుమ్మరిపల్లికి వెళుతున్నానని చెప్పి ఆటోలో వెళుతుండగా చివరిసారిగా చూసినట్లుగా తల్లి చెబుతోంది. అదేరోజు అత్తగారింటికి చేరి అక్కడ తోడికోడలు, అత్తగారితో గొడవపడి రాత్రి 7 గంటల సమయంలో అంగడికి వెళ్లి వస్తానని వెళ్లిందని, అప్పటి నుంచి తన కూతురు, పిల్లల ఆచూకీ తెలియరాలేదని భార్గవి తల్లి కృష్ణవేణి చెబుతోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వివరాలు తెలిపిన వారు చిన్నమండెం పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు.

## అక్రమ మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

● రూ.లక్ష విలువ చేసే 347 మద్యం బాటిళ్లు స్వాధీనం




నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

కడప (క్రైం), జనవరి 25 : కడప నగరం అశోక్‌నగర్ పాత బైపాస్ వద్ద ఓ వ్యక్తి రూ.లక్ష విలువ చేసే మద్యం బాటిళ్లను అక్రమంగా విక్రయిస్తుండగా చిన్నచౌకు పోలీసులు అరెస్టు చేశారు. గురువారం చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో సీఐ నరసింహారెడ్డి నిందితుడి వివరాలు వెల్లడించారు. కడప రాజారెడ్డివీధికి చెందిన ఎర్రబల్ల సుధీర్ ప్రస్తుతం సీకేదిన్నె మండలం ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 35 ఫుల్ బాటిళ్లు, 12 బీర్ బాటిళ్లు, 375 ఎంఎల్ 10, క్వార్టర్ బాటిళ్లు 290 మొత్తం 347 బాటిళ్లు సంచుల్లో పట్టుకుని తీసుకెళుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. డీఎస్పీ షరీఫ్ ఆదేశాల మేరకు ఎస్‌ఐ రవికుమార్, మహ్మద్‌రఫీ సిబ్బందితో నిందితుడిని అరెస్టు చేసి బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ లక్ష రూపాయలు ఉంటుందన్నారు.

### వల్లూరులో 71 బాటిళ్లు...



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌ఐ

వల్లూరు, జనవరి 25 : మండల పరిధిలోని శీతోరుపల్లెలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని విషయం తెలియడంతో ఎస్‌ఐ వెంకటరమణ సిబ్బంది దాడులు చేసి దాదాపు 71 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆయన వివరాల మేరకు... శీతోరుపల్లె గ్రామంలో వల్లూరుకు చెందిన వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే వారిని ఉపేక్షించేదిలేదని ఎస్‌ఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ మోహన్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## విజిలెన్స్ దాడులు... సిలిండర్లు స్వాధీనం



సీజ్ చేసిన సిలిండర్లతో విజిలెన్స్ అధికారులు

కడప (క్రైం)/ఖాజీపేట, జనవరి 25 : కడప రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి షేక్ మాసుంబాషా ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు ప్రతిరోజూ దాడులు నిర్వహిస్తున్నారు. గురువారం ఖాజీపేటలోని మైదుకూరు రోడ్డులో గల శ్రీరామ ఎలక్ట్రికల్స్, ప్రహ్లాద ఎలక్ట్రికల్స్ షాపులపై ఖాజీపేట మండల ఆర్‌ఐలతో కలిసి దాడులు నిర్వహించి తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో శ్రీరామ ఎలక్ట్రికల్స్‌లో అక్రమంగా వినియోగిస్తున్న 3 ఇండేన్, 1 భారత్ గృహావసర సిలిండర్లను, ఆరు చిన్నసిలిండర్లను, శ్రీప్రహ్లాద ఎలక్ట్రికల్స్‌లో 4 ఇండేన్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు వాటిని సీజ్ చేసి ఖాజీపేట ఆర్‌ఐకి అప్పగించారు. ఆయా షాపుల యజమానులైన సుంకు ప్రభాకర్, ప్రహ్లాద అనే వ్యక్తులపై కేసు నమోదు చేశామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు రెడ్డప్ప, బాలగంగాధర్‌రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసరు పెనుగొండ రవి, హెడ్ కానిస్టేబుల్ జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం దుంగతో పాటు స్మగ్లర్ అరెస్ట్

రామాపురం, జనవరి 25: రాయచోటి రేంజ్ పరిధిలోని గువ్వలచెరువు తూర్పు భాగంలోని కొత్తిమడుగు బీట్ పరిధిలో గురువారం ఎర్రచందనం దుంగను స్వాధీనం చేసుకుని స్మగ్లర్ సొక్క లింగంను అరెస్టు చేసినట్లు వంగిమళ్ల సెక్షన్ ఆఫీసర్, ఎఫ్‌ఎస్‌ఓ భరణికుమార్ తెలిపారు. రామాపురం మండలం గువ్వలచెరువు తూర్పు భాగంలోని కొత్తిమడుగు బీటులో కూంబింగ్ నిర్వహిస్తుండగా జీలో బావి ప్రదేశంలో సుమారు పది మంది ఎర్రచందనం కూలీలు చెట్లను నరుకుతుండగా దాడి చేయడంతో ఒకరు పట్టుబడగా 9 మంది పరారైనట్లు ఆయన తెలిపారు. ఈదాడిలో ఎఫ్‌బీవో మహబూబ్ బాషా, బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముచ్చుమర్రి వద్ద 3 కేజీల వెండి సీజ్



సీజ్ చేసిన వెండి వస్తువులతో ట్రైనీ డీఎస్పీ

కొండాపురం, జనవరి 25 : మండలంలోని ముచ్చుమర్రి పునరావాస కేంద్రం వద్ద గురువారం పోలీసులు మూడు కేజీల వెండి వస్తువులను సీజ్ చేశారు. ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్, కొండాపురం ఎస్‌ఐ యోగీంద్ర ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా రమణయ్య అనే వ్యక్తి తాడిపత్రి నుంచి రాయచోటికి కారులో వెండి వస్తువులను తీసుకెళుతుండగా వాటిని స్వాధీనం చేసుకున్నారు. వీటికి సంబంధించిన సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు తెలిపారు. వీటిని ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు వారు పేర్కొన్నారు.

## ఆలయంలో చోరీ... దొంగలు దొరికారు

వేంపల్లె, జనవరి 25: వేంపల్లెలోని రామాలయంలో బంగారు, వెండి నగలను చోరీ చేసిన దొంగలను పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. దొంగతనం జరిగిన వెంటనే సీఐ చాంద్‌బాషా చుట్టుపక్కల పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చి తనిఖీలు నిర్వహించడంతో రాయచోటిలో పట్టుబడ్డట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# బాబోయ్.. దొంగలు



● పట్టపగలే చోరీలు ● అందినవన్నీ దోచుకెళుతున్నారు ● సీకే దిన్నె ఠాణాకు సవాల్

### చోరీలను అరికట్టాలి..



నాకు నాలుగు లారీలు ఉన్నాయి. బాడుగలు లేనప్పుడు లారీలను ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో ఉంచుతాము. సంక్రాంతి పండుగ కనుమ రోజున ఏకంగా రెండు లారీలలోని బ్యాటరీలను చోరీచేశారు. పోలీసులు చోరీలను అరికట్టాలి.

**- సుభాన్, లారీ ఓనర్, ప్రొఫెసర్స్ కాలనీ**

### బెంబేలెత్తుతున్నాం..



నేను మేకలు మేపుకుంటు జీవనం సాగిస్తున్నాను. ఇప్పటికి పలుమార్లు మా మేకలను దొంగలించారు. పోలీసులకు చెప్పుకున్నా ప్రయోజనం లేదు. కాలనీలోని పలు ఇళ్లలో కూడా వరుస దొంగతనాలు జరుగుతుండడంతో బెంబేలెత్తుతున్నాం.

**- ఓబులేసు, మేకల కాపరి, సాయిప్రతాప్ కాలనీ**




కడప(రూరల్), జనవరి 25: కడప రూరల్, అర్బన్ ఏరియాలోని చింతకొమ్మదిన్నె ఠాణాలో దొంగలు రెచ్చిపోతున్నారు. పట్టపగలే దొంగతనాలు చేస్తున్నారు. వరుస చోరీలకు పాల్పడుతూ చిక్కినవన్నీ దోచుకెళుతున్నారు. ఎవరు లేనిది చూసి ఇళ్లల్లోకి ఎగబడి చోరీలకు పాల్పడుతూ హల్‌చల్ చేస్తున్నారు. ఒకే గ్రామంలో (సాయిప్రతాప్ నగర్‌లో) వరుసగా చోరీలకు తెగబడ్డారు. ఇలా ప్రతి రోజు ఏదో ఒకచోట మేకలు, పొట్టేళ్లు, కోళ్లు, మంచినీటి మోటార్లు, లారీలు, ఆటోల బ్యాటరీలు, ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైరు, అందులోని ఆయిల్, వ్యవసాయ మోటార్లు, సర్వీసు వైర్లు, పైపులు, ఇనుప వస్తువులు... ఇలా ఏదిపడితే అది దోచుకెళ్తుండడంతో జనం ఆందోళనచెందుతున్నారు. రాత్రివేళల్లో కాకుండా పగటిపూటనే దొంగతనాలు చేస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. చోరీలపై పోలీసులకు ఫిర్యాదులు అందినప్పటికీ దొంగలు మాత్రం వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు.

**ఇవీ వరుస దొంగతనాలు..**

● సీకేదిన్నె ఠాణాకు కూతవేటు దూరంలోని సాయిప్రతాప్ నగర్‌లో 2023 డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగరోజున గంగాదేవి అనే మహిళకు చెందిన రూ.20వేల విలువచేసే పొట్టేలును పట్టపగలే దొంగలు ఎత్తుకెళ్లారు. దీనికి రెండు రోజుల క్రితమే ఇదే మహిళకు చెందిన రెండు నాటుకోళ్లను ఎత్తుకెళ్లారు.

● 2023 డిసెంబర్ 26న సాయిప్రతాప్‌నగర్‌లోనే శ్రీనువాసులుకు చెందిన ఇంటిలోని రూ. 15 వేల విలువచేసే రెండు మంచినీటి మోటార్లను చోరీచేశారు. ఆ మరుసటి రోజు కోర్టు ఉద్యోగికి చెందిన పక్కింటిలోని మరో మోటారు దోచుకెళ్లారు.

● సాయిప్రతాప్ నగర్‌లోనే ఓబులేసు అనే మేకల కాపరికి చెందిన రూ.20వేల విలువ గల రెండు మేకలను ఇటీవల దొంగలు దోచుకెళ్లారు.

● సంక్రాంతి పండుగ కనుమ రోజున ప్రొఫెసర్స్ కాలనీలో సుభాన్‌బాషాకు చెందిన రెండు లారీల్లోని రూ.10వేల విలువ చేసే రెండు బ్యాటరీలను దోచుకెళ్లారు. ఇంతకు మునుపు కూడా ఇదే కాలనీలో నబీల్‌కు చెందిన లారీలోని రూ.5వేల విలువగల బ్యాటరీని గుర్తు తెలియని దొంగలు దోచుకెళ్లారు. ఇప్పటికైనా పోలీసులు నిఘాను పెంచి దొంగతనాలను అదుపుచేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

### ఫిర్యాదులకు వెంటనే స్పందిస్తున్నాం..



చోరీలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా స్పందిసున్నాం. నిఘాను ముమ్మరం చేశాం. ఇప్పటికే పలుమార్లు చోరీలకు పాల్పడుతున్న దొంగలను అరెస్టుచేశాం. చోరీలను పూర్తి స్థాయిలో అదుపు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**- శ్రీనివాసులరెడ్డి, ఎస్‌ఐ, చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్**

## వైభవంగా కోదండరాముడి కళ్యాణం



భక్తులకు మాంగళ్యాన్ని చూపిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, జనవరి 25 : ఏకశిలా నగిరి కోదండరామాలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపం వద్ద నుంచి కల్యాణతంతును ప్రారంభించారు. విశ్వక్షేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణను వైష్ణవ సంప్రదాయంలో వేదపండితులు నిర్వహించారు. అనంతరం మాంగళ్యధారణను సీతమ్మ తల్లికి శ్రీరామచంద్రుడు సమర్పించారు. మాంగళ్యధారణ అనంతరం తలంబ్రాలు సమర్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకులు వీణారాఘవాచార్యులు, మనోజ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు .

## దళారులను నమ్మొద్దు

ఖాజీపేట, జనవరి 25: రైతులు పండించిన జొన్న పంటను దళారీ వ్యవస్థ కంటే అధికంగా ప్రభుత్వం కొంటుందని ఏపీ సీడ్స్ డీఎం అర్జున్‌రావ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని మిడుతూరులోని రైతులు ఆరబెట్టిన జొన్న పంటను రాష్ట్ర ఉద్యాన సలహాదారుడు ప్రసాద్‌రెడ్డి, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారీలు మార్కెట్‌ధర రూ.2,200 లకు తీసుకుంటున్నారని, ప్రభుత్వం మద్దతు ధర రూ.3180తో కొనుగోలు చేస్తుందన్నారు. ఈకేవైసీ చేయించుకున్న ప్రతి రైతు వద్ద ఎకరాకు 18 క్వింటాళ్లు చొప్పున 14 శాతం తేమ ఉన్న పంటను కొనుగోలు చేస్తామన్నారు. మండల పరిధిలో 955 ఎకరాల జొన్న పంట సాగు చేశారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగార్జున, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.



## ఉపయోగంలో లేని చెక్కులు దహనం



చెక్కుబుక్కులను దహనం చేస్తున్న అధికారులు

రాయచోటి(కలెక్టరేట్), జనవరి 25: అన్నమయ్య జిల్లా ఖజానాశాఖ పరిధిలోని 8 ఉప ఖజానా కార్యాలయాల్లో ఉపయోగంలో లేని చెక్కు బుక్కులను గురువారం దహనం చేసినట్లు జిల్లా ఖజానా అధికారి సయ్యద్ మహబూబ్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ పర్యవేక్షణలో ఉపయోగంలో లేని 4380 చెక్కుబుక్కులు దహనం చేసినట్లు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో 10 మంది జిల్లాస్థాయి అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి సమీక్షించడం జరిగిందన్నారు. ఈ కమిటీ తీసుకున్న నిర్ణయం ప్రకారం జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఉపయోగంలో లేని చెక్కుబుక్కులను జిల్లా అడిషనల్ ఎస్పీ, రెవెన్యూ అధికారి, రిజిస్ట్రార్, అగ్నిమాపక దళ అధికారి, జిల్లా ఖజానా అధికారి ఆధ్వర్యంలో 8 ఉప ఖజానా అధికారుల సమక్షంలో చెక్కు బుక్కు లను దహనం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహాయ ఖజానా అధికారి ఖాదర్‌వలి, జిల్లా ఖజానా కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పీహెచ్‌డీ పరీక్షల తనిఖీ



పరీక్షలను పరిశీలిస్తున్న వైస్ ఛాన్సలర్

కడప (ఎడ్యుకేషన్), జనవరి 25 : వైవీయూలో జరుగుతున్న పీహెచ్‌డీ పరీక్షలను వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ ఆకస్మిక తనిఖీ చేశారు. గురువారం వైవీయులో ఏపీజె అబ్దుల్‌కలాం కేంద్ర గ్రంథాలయ ఆవరణంలో జరుగుతున్న ప్రీ పీహెచ్‌డీ పరీక్షల కేంద్రానికి ఆకస్మికంగా వెళ్లి తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. పరీక్షల ఏర్పాట్లు, విద్యార్థుల హాజరు వంటి వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

## రీసర్వే వేగవంతం చేయాలి : ఇన్‌చార్జ్ కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 25: జిల్లాలో చేపట్టిన రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి కలెక్టర్లు, జేసీలతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి విజయవాడ సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ, డీఎంహెచ్‌వో డాక్టర్ కొండయ్య, ల్యాండ్, సర్వే ఏడీ జయరాజ్, డ్వామా పీడీ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూడో దశ రీసర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత బాధితులను గుర్తించిన వారిలో హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## 28న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్



కరపత్రం ఆవిష్కరిస్తున్న లేవాకు నితీష్‌కుమార్‌రెడ్డి

సీకేదిన్నె, జనవరి 25: కడప నగరం రామచంద్రాపురంలోని మ్యాంటిస్సోరీ జగతి ఇంటర్నేషనల్ స్కూలులో ఈనెల 28న రాష్ట్రస్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కరస్పాండెంట్ లేవాకు నితీష్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లో వయస్సుతో నిమిత్తం లేకుండా పాల్గొనవచ్చన్నారు. లక్ష రూపాయలు ప్రైజ్‌మనీ అందించనున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ కొరకు 9346240540 నెంబరుకు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ సురేంద్ర, చందు తదితరులు పాల్గొన్నారు.

## జగన్‌ను ఓటమి ఫోబియా వెంటాడుతోంది

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ తులసిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

రాయచోటి టౌన్, జనవరి 25: ముఖ్యమంత్రి జగన్‌ను ఓటమి పోబియా వెంటాడుతోందని, రాబోయే ఎన్నికల్లో వైసీపీ ఇంటికి పోవడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్, రాజంపేట పార్లమెంట్ కోఆర్డినేటర్ తులసిరెడ్డి అన్నారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ 25 మంది మంత్రులు కూడా ఓటమి పాలవుతారని సర్వేలు చెబుతున్నాయన్నారు. ఆయన సొంత నియోజకవర్గంలో కూడా సభ పెడితే జనం లేక వెలవెలబోతున్నాయని, అందుకే ఆయన సంతోషంగా దిగిపోతానంటూ ఓటమి ముందే ఒప్పుకుంటున్నట్లుగా ఉందన్నారు. ఆయన 90 శాతం సంక్షేమ పథకాలు అమలు చేశానని గొప్పలు చెప్పుకుంటున్నా అవి ఎక్కడా అమలైన దాఖలాలు లేవన్నారు. నవరత్నాల పేరుతో రాష్ట్ర ప్రజలను నవ మోసాలు చేస్తూ పబ్బం గడుపుకుంటూ ప్రచార ఆర్భాటాలు తప్ప సంక్షేమ అభివృద్ధి కంటికి కనిపించడం లేదని ఆరోపించారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ చీల్చిందని చెబుతున్నా ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి రాష్ట్ర విభజన కోసం మొదటి సంతకం చేసింది కూడా ఆయనే అనే విషయం మర్చిపోకూడదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నేతలు, నియోజకవర్గ కన్వీనర్లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ పెండింగు నిధులను విడుదల చేయాలి

**● టీడీపీ ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ**



మాట్లాడుతున్న వికాస్ హరి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 25:ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ నిర్వీర్యమైందని, దానికి సంబంధించిన బకాయిలు రూ.12కోట్లను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ డిమాండ్ చేశారు. గురువారం టీడీపీ జిల్లా కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాక ఆరోగ్య సేవలు నిలిపివేస్తామని ప్రైవేటు ఆసుపత్రులు ప్రభుత్వానికి సూచిస్తున్నాయన్నారు. ఆరోగ్య సేవలు నిలిపివేస్తే హాస్పిటల్ లైసెన్సులు రద్దు చేస్తామని క్రిమినల్ కేసులు పెడతామని బెదిరించడం సమంజసమన్నారు. ఇటువంటి పరిపాలన దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ నిధులు సకాలంలో అందేవని, అలాగే ఈహెచ్ఎస్ 20 శాతం పెంచారని గుర్తు చేశారు. ప్యాకేజీలు కూడా 7 శాతం పెంచిన ఘనత టీడీపీదేనని పేర్కొన్నారు. కేవలం ప్రచారానికి మాత్రమే ఆరోగ్యశ్రీ వాడుకుంటూ గొప్పలు చెప్పుకుంటున్నారే కానీ సామాన్య ప్రజలకు ఆరోగ్యశ్రీ వల్ల ఒరిగిందంటూ ఏమీ లేదని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు కూడా ఆరోగ్యశ్రీ కొనసాగించేందుకు ముందుకు రావడంలేదని, దీనికి కారణం వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలేనన్నారు. ఇప్పటికైనా రాష్ట్రవ్యాప్తంగా పెండింగులో ఉన్న ఆరోగ్యశ్రీ నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు.

## శ్మశానవాటిక స్థలాన్ని మా గ్రామానికే కేటాయించాలి

**● నిరసన కార్యక్రమంలో చలమారెడ్డి పల్లెవాసులు**

కడప (మారుతీనగర్), జనవరి 25: తమ గ్రామానికి శ్మశానవాటిక స్థలాన్ని కేటాయించాలని నగర పరిధిలోని 2వ డివిజన్ చలమారెడ్డి పల్లెవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కేటాయించిన స్థలంలోనే కాంపౌండ్ వాల్ నిర్మించాలని ఆ గ్రామనివాసులు బత్తల శ్రీనివాసులు, బత్తల రవి, నంద్యాల నాగసుబ్బన్న డేరంగుల ఎర్రన్న, బత్తల శివ, జరిపిటి మహేష్ కోరారు. శ్మశానవాటిక స్థలంలో నుంచి 50 సెంట్లను సమీప కాలనీవాసులకు కేటాయించినట్లు ప్రభుత్వం చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రెండవ డివిజన్‌లో ప్రభుత్వ భూమి చాలా ఉన్నప్పటికీ మా గ్రామానికి కేటాయించిన శ్మశానవాటిక స్థలంలోనే ఇతరులకు 50 సెంట్ల స్థలాన్ని కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయమై ఇటు రెవెన్యూ అధికారులు, అటు సంబంధిత డివిజన్ ప్రజాప్రతినిధులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడం సరైందికాదన్నారు.

## విజ్ఞాన నిధి బాలయేసు

కడప (కల్చరల్), జనవరి 25: బాల్యము నుంచే క్రీస్తు ప్రభువు అమితమైన జ్ఞానం కలిగి సకల శాస్త్రములను ఆధ్యయనం చేశారని చెన్నూరు విచారణ గురువులు ఫాదర్ లక్కినేని పీటర్ ప్రభాకర్ పేర్కొన్నారు. బాలయేసు మహోత్సవాలను పురస్కరించుకుని నగర మాసాపేటలో వెలసిన సెయింట్ జాన్ చర్చిలో ఉత్సవాలు నిర్వహించారు. మొదటిరోజు పవిత్రాత్మ స్వస్థత ప్రార్థన కూటములు, దివ్యబల పూజ, దేవుని వాక్యమును అందించారు. అనంతరం మాట్లాడుతూ క్రీస్తు ప్రభువును పవిత్రాత్మచే ఎన్నుకోవడం వల్ల ఆయనకు గర్భం నుంచే గొప్ప జ్ఞానం పొందగలిగారన్నారు. బాలుడుగా ఉన్నపుడే దేవాలయాలలో వేద పండితులకు సూచనలు సలహాలను ఇచ్చేవారన్నారు. కావున ఆయన సన్నిధికి వచ్చి ప్రార్థించిన వారికి సకల విజ్ఞానంతోపాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందజేస్తారన్నారు.

## చలో రాజమండ్రి విజయవంతం చేయండి

**● యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా**

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 25 : ఈ నెల 28న జరిగే చలో రాజమండ్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా. జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం యూటీఎఫ్ భవన్‌లో చలో రాజమండ్రి కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ రద్దుకు సంబంధించి ఎన్నో ప్రాతినిధ్యలు పోరాటాల తరువాత గత ప్రభుత్వం టక్కర కమిషన్ నియమించిందని చివరి వేతనంలో 50 శాతం పెన్షన్ ఇస్తామని ప్రతిపాదించిందని, అయితే ఆ ప్రతిపాదన ఎవరికీ ఆమోద యోగ్యంకాలేదన్నారు.

## బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా నూరుద్దీన్

కడప (మారుతీనగర్), జనవరి 25: భారతీయ జనతా పార్టీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా షేక్ నూరుద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వుల పత్రాలను నూరుద్దీన్ అందుకున్నారు.

# టీడీపీ అధికారంలోకి వస్తే అసాంఘిక శక్తులను అణచివేస్తాం

**● కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి**

కడప (ఎడ్యుకేషన్), జనవరి 25 :రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ అసాంఘిక శక్తులను అణచివేస్తామని టీడీపీ కడప నియోజవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి, జనసేన జిల్లా కోఆర్డినేటర్ సుంకర శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం కడప నగరం 8వ డివిజన్ స్కౌటు హాలు నుంచి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. అలాగే ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అక్రమాలపై ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు ప్రభుత్వం వచ్చిన వెంటనే అమలు చేస్తామన్నారు. మహిళలకు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటు ఉంటుందన్నారు. శాంతిభద్రతలను కాపాడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ



బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో మాధవీరెడ్డి

జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరికృష్ణ, నగర అధ్యక్షుడు సానపు రెడ్డి శివకొండారెడ్డి, నాయకులు మాసాపేట శివ, ట్రాన్స్‌ఫార్మర్ శ్రీను, మల్లిఖార్జున, గుర్రం నటరాజ్, చినబాబు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రాబోవు ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించాలి

**● అమీర్‌బాబు, అలంఖాన్‌పల్లె లక్ష్మీరెడ్డి**



మాట్లాడుతున్న అమీర్‌బాబు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 25 : రాబోవు ఎన్నికల్లో ప్రజలందరూ చంద్రబాబునాయుడుకు ఓటు వేసి గెలిపించాలని టీడీపీ సీనియర్ నాయకులు వీఎస్ అమీర్‌బాబు, అలంకాన్‌ఎల్లె లక్ష్మిరెడ్డి పేర్కొన్నారు. గురువారం కడప నగరం రహ్మతీయ ఫంక్షన్‌హాలులో కడప నియోజకవర్గం క్లస్టర్, బూత్ లెవల్ డివిజన్ ఇన్‌ఛార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ఒక్క చంద్రబాబుతోనే అది సాధ్యమన్నారు. అరాచకమైన పరిపాలనను అంతం చేయాలంటే చంద్రబాబునాయుడు సీఎం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. టీడీపీ గెలిస్తే అమరావతి రాజధానిగా ఉంటుందని అన్నారు. 40 సంవత్సరాలుగా సుదీర్ఘంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాబోవు ఎన్నికల్లో కడప నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి బూత్ లెవల్‌లో ఇద్దరు మహిళలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా అధికారి ప్రతినిధి ఆమూరి బాలదాసు, నాయకులు లింగాల శంకర్‌రెడ్డి, మజ్జారి జయరాం, జాకీర్, జింకా శ్రీను, ఓబుల్‌రెడ్డి, మేకల వెంకటేశ్‌యాదవ్, పల్లె సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# పుత్తా ఆధ్వర్యంలో 80 కుటుంబాలు టీడీపీలో చేరిక

సీకేదిన్నె, జనవరి 25: తెలుగుదేశం పార్టీకి రోజు రోజుకు ఆదరణ పెరుగుతోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్లలో మాజీ సర్పంచ్ వెల్లాల శ్రీనివాసులయాదవ్, గంగాదేవి ఆధ్వర్యంలో పుత్తా చైతన్యకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో 80 కుటుంబాలు బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో గురువారం వైసీపీ నుండి టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు జగన్‌పై విరక్తి కలిగిందని, ఒక్క అవకాశం పేరుతో మోసపోయిన ప్రజలు ఇప్పుడు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని ఎదురుచూస్తున్నారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా తెలుగుదేశాన్ని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు ఉంటుందని, ప్రజలు నమ్ముతున్నారన్నారు. టీడీపీలో చేరినవారిలో భరతం ఈశ్వరయ్య, వెంకటరమణ, శంకర్,



టీడీపీలో చేరిన తాడిగొట్ల ప్రజలు

నాగేంద్ర, పుత్తా చైతన్యకుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజా, బాలగంగయ్య, గంగాధర్, గంగాదేవి, సుబ్బమ్మ, అమ్మణి, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టక్కోలి వెంకటకృష్ణారెడ్డి, గంధం మోహన్‌బాబు, ఓబుళరెడ్డి, నారాయణరెడ్డి, కొండయ్య, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీ నోటిఫికేషన్‌ను వెంటనే విడుదల చేయాలి

కడప (సెవెన్‌రోడ్స్), జనవరి 25 : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీని విడుదల చేయాలని కోరుతూ డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27, 28న నిరాహారదీక్ష దీక్షలు చేపట్టనుంది. ఈ దీక్షలో రాష్ట్రంలోని డీఎస్సీ అభ్యర్థులు పాల్గొని జయప్రదం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్‌లు పిలుపునిచ్చారు. గురువారం 36గంటల దీక్ష పోస్టరును జిల్లా కార్యాలయంలో విడుదల చేశారు.

## 'ఎమ్మెల్యే, ఎంపీగా అవకాశం కల్పించాలి'

కడప (ఎడ్యుకేషన్), జనవరి 25 : దూదేకుల ముస్లింలకు ఎమ్మెల్యే, ఎంపీగా అవకాశం కల్పించాలని ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షుడు సుంకేసుల బాదుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగిడాల పెద్దన్నలు డిమాండ్ చేశారు. గురువారం కడప నగరం ఎంబీసీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 20 లక్షలు దూదేకులు ముస్లింలు ఉన్నారని, ఇప్పటి వరకు ఒక్క ఎమ్మెల్యే సీటు కానీ, ఎంపీ సీటు కానీ అవకాశం కల్పించకపోవడం తగదన్నారు.

## వారసత్వ కళను రక్షించుకుందాం

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 25 : భారతీయ వారసత్వ సంపద ఎంతో ఘనమైనదని నేటి తరం దానిని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని భావితరాల కోసం వాటిని రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వ లూరు బ్రహ్మయ్య తెలిపారు. గురువారం జాతీయ పర్యాటక దినోత్సవ సందర్భంగా పర్యాటక సంస్థ కార్యాలయంలో సభ నిర్వహిచారు. దాదాపు 250 సంవత్సరాల క్రితం దేవాలయ సాంప్రదాయ నృత్యానికి సంబంధించిన ఫోటోను కడప ఇంటాక్ ద్వారా సేకరించారు.

**ఓటు అనే ఆయుధాన్ని సద్వినియోగం చేసుకోవాలి**



మాట్లాడుతున్న బొమ్మన విజయ్

కడప (మారుతీనగర్), జనవరి 25: ఓటు అనే ఆయుధాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, రాష్ట్ర కార్యదర్శి బత్తల పవన్‌కుమార్ ఓటర్లకు సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నూతన ఓటర్లతో వర్చువల్ సమావేశం నిర్వ హించారు. ఇందులో భాగంగా బొమ్మన విజయ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో మోదీ వర్చువల్ మీటింగ్ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్బారెడ్డి, గాలి హరిప్రసాద్, నాయకులు శ్రీనివాసులు, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. లోకేష్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ దశరథ, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

వల్లూరు, జనవరి 25 : కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన వల్లూరులో వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఓటు అవసరం

పులివెందుల రూరల్, జనవరి 25: ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునేందుకు ఓటు వజ్రాయుధంలా పనిచేస్తుందని పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు పేర్కొన్నారు. గురువారం జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగాపూలంగల్ల సర్కిల్‌లో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు.

**ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి**

కడప (నాగరాజుపేట), జనవరి 25 : ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీరు ఎస్ఈ రమణ పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం విద్యుత్ భవన్‌లో తమ కార్యాలయంలో సహ ఉద్యోగులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు.

**ఓటు వజ్రాయుధంలాంటిది**

పులివెందుల టౌన్, జనవరి 25: ఓటు వజ్రాయుధంలాంటిదని అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని లయోలా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అమల్‌రాజ్ సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా లయోలా పాలిటెక్నికల్ కళాశాలలో అవగాహనసదస్సు కార్యక్రమం నిర్వహించారు. లయోలా పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ బ్రిట్టో, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

**ఓటు విలువను ప్రతి ఒక్కరు గుర్తించాలి**

వేంపల్లె, జనవరి 25: ప్రతిరూ ఓటు విలువను గుర్తించి ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యం కావాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. గురువారం ట్రిపుల్‌ఐటీలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఫైనాన్స్ అధికారి కోటేశ్వరి, ఏఓ రాంభూపాల్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ విశ్వనాథరెడ్డి, ఇందుమతి, అనిల్‌కుమార్‌రెడ్డి, అసోసియేట్ డీన్ ఆఫ్ అకాడమిక్ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

**ఓటు ప్రాధాన్యతను తెలుసుకోండి**

వేంపల్లె, జనవరి 25: ఓటు ప్రాధాన్యతను, విలువను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజనేయులు సూచించారు. గురువారం జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో వేంపల్లెలోని మదీనాపురంలో ప్రత్యేక ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఏర్పాటుచేశారు.

**ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవాలి**

చెన్నూరు, జనవరి 25: రాజ్యాంగం బాగా అమలు కావాలంటే ప్రజలు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు ఆలీఖాన్ అన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఆ ప్రాంతంలో ఎక్కువ సార్లు ఓటు వినియోగించుకున్న వారిని సన్మానించారు.

## ప్రలోభాలకు గురిచేసే పార్టీలపై చర్యలు తీసుకోవాలి

కడప (మారుతీనగర్), జనవరి 25: వచ్చే ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేసే పార్టీలపై చర్యలు తీసుకోవాలని మహాజన రాజ్యం పార్టీ (ఎమ్మార్పీ) వ్యవస్థాపక అధ్యక్షుడు సంగటి మనోహర్ భారత ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా నగరంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యురాలు షేక్ హుమెర, జాతీయ సమన్వయ కర్త షేక్ అమీన్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

## సమర్ధవంతంగా విధులు నిర్వహించాలి: డీఎస్పీ

కడప (క్రైం), జనవరి 25 : వచ్చే ఎన్నికల్లో పోలీసు అధికారులు, సిబ్బంది విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కడప డీఎస్పీ షరీఫ్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాలులో గురువారం కడప పోలీసుస్టేషన్‌లోని సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల్లో విధులు ఏ విధంగా నిర్వహించాలని, ఆ సమయంలో పోలీసులు ఎదుర్కొనే సమస్యలు, వాటిని చట్టపరంగా ఎలా పరిష్కరించాలనే అంశాలపై సూచనలు అందించారు. ఓటర్లను చైతన్యం చేయడంతో పాటు ఓటర్లకు ప్రలోభ పెట్టేవారిపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని, సమర్థవంతంగా ఎన్నికల విధులు నిర్వహించి మంచి పేరు తేవాలన్నారు. కడప నగర పోలీసుస్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్డీఓ బంగ్లా ప్రారంభం

పులివెందుల టౌన్, జనవరి 25: పులివెందుల రెవిన్యూ డివిజనల్ అధికారి బంగ్లా గురువారం ప్రారంభించారు. పట్టణంలోని హలిప్యాడ్ సమీపంలోని శ్రీకృష్ణ ఆలయం పక్కన రూ.3.09కోట్ల వ్యయంతో నిర్మించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ విజయరామరాజు చేతులమీదుగా బంగ్లాను ప్రారంభించారు. జేసీ గణేష్‌కుమార్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పాల్గొన్నారు.

## 50 మద్యం బాటిళ్ల పట్టివేత

వేంపల్లె, జనవరి 25: వీరన్నగట్టుపల్లెకు చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద 50 మద్యం బాటిల్లు స్వాధీనంచేసుకున్నట్లు సీఐ చాంద్‌బాష తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

**PUBLIC NOTICE**

Under the instructions of my client M/s Shriram finance ltd. Kadapa-1 branch issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Dudde Vijaya Bhaskar** Son of Dudde Ramanaiah, resident of Door No. 2/10, Kalamralla Road, Chilamakur Village, Yeraguntla Mandal, YSR District by mortgaging the below schedule mentioned property as security by way of equitable mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 7days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. **SHEDULE OF THE PROPERTY : Item No.1 :** Sy. No. 920/1 of Chilamakur Village fields, Extent : 377.32 Square Yards, Location : Vacant Site situated at YSR District, Kadapa Registration District, Muddanur Sub-District, Yeraguntla Mandal, Chilamakur Grama Panchayat, 4th Ward, within the limits of Chilamakur Village fields, Plot No. 10 bearing Sy. No. 920/1 to an extent of 377.32 Sq. yards **Boundaries :** East- 24 feet width joint rastha for passage, West : Site in Plot No.1, North : Land of Mule Chennamma, South : 30 feet width joint rastha let to for passage. **Item No.2 :** Sy. No. 920/1 of Chilamakur Village fields, Extent : 364.694 Square Yards, Location : Vacant Site situated at YSR District, Kadapa Registration District, Muddanur Sub-District, Yeraguntla Mandal, Chilamakur Grama Panchayat, 4th Ward, within the limits of Chilamakur Village fields, Plot No. 11 bearing Sy. No. 920/1 to an extent of 364.694 Sq. yards **Boundaries :** East- Site in Plot No. 20, West : Joint Rastha of 24 feet width, North : Land of Mule Chennamma, South : 30 feet width joint rastha let to for passage. **Item No.3 :** Sy. No. 920/1 of Chilamakur Village fields, Extent : 216.63 Square Yards, Location : Vacant Site situated at YSR District, Kadapa Registration District, Muddanur Sub-District, Yeraguntla Mandal, Chilamakur Grama Panchayat, 4th Ward, within the limits of Chilamakur Village fields, Plot No. 25 bearing Sy. No. 920/1 to an extent of 216.63 Sq. yards **Boundaries :** East- Site in Plot No. 26, West : 24 feet width joint rastha, North : Site in Plot No. 24, South : Land of Busetty Subbarayudu. **Item No.4 :** Sy. No. 920/1 of Chilamakur Village fields, Extent : 216.63 Square Yards, Location : Vacant Site situated at YSR District, Kadapa Registration District, Muddanur Sub-District, Yeraguntla Mandal, Chilamakur Grama Panchayat, 4th Ward, within the limits of Chilamakur Village fields, Plot No. 26 bearing Sy. No. 920/1 to an extent of 216.63 Sq. yards **Boundaries :** East- 24 feet width Joint Rastha, West : Site in Plot No. 25, North : Site in Plot No. 25, South : Land of Busetty Subbarayudu

Yours faithfully
**SHIAK KHAJA MOHIDDIN**
M.A. M.Phil. BL., Advocate & Notary

## 'విగ్రహాల ఏర్పాటు కోసం పేదల కడుపు కొడతారా'

వేంపల్లె, జనవరి 25: పెద్దపెద్ద మున్సిపాలిటీలలో లేని విధంగా రోడ్డు విస్తరణ కోసం వేంపల్లెలో 90అడుగుల దాకా వెడల్పు తీసుకున్నారు. కానీ సర్కిల్ అంతా విగ్రహాల ఏర్పాటుకోసమే అన్న విధంగా ఇష్టానుసారంగా పనులు చేస్తుండడం ఆక్షేపనీయమని టీడీపీ మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, కడప పార్లమెంట్ రైతు విభాగ అధ్యక్షులు అన్నారెడ్డి బాలస్వామిరెడ్డిలు అన్నారు. వేంపల్లెలో గురువారం వారు మాట్లాడుతూ ప్రణాళిక లేకుండా రోడ్డు విస్తరణ పనులు చేయడం ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తోందన్నారు. రోడ్డు విస్తరణ కోసం మైనార్టీకి చెందిన, బీసీలకు చెందిన ఇళ్లు, గదులు పూర్తిగా పోతున్నాయని, జీవనోపాధి కోల్పోతున్నాయని గుర్తుచేశారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా వైసీపీ నాయకులకు చెందిన విగ్రహాల ఏర్పాటుకోసమన్నట్లుగా వెడల్పుగా సర్కిల్ కోసం గుంతలు తీయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. గతంలో నాలుగురోడ్ల కూడలిలో పోలీస్ ఐల్యాండ్ ఉందని, ఆ ఐల్యాండ్‌ను ఏర్పాటుచేసి సర్కిల్ వద్ద కడప, పులివెందుల, రాయచోటి రోడ్డులోకి బస్సులు, లారీలు సక్రమంగా వెళ్లేలా చేయాలని టీడీపీనాయకులు డిమాండ్ చేశారు. మైనార్టీ నాయకులు పూల అల్లాబక్షు, మాజీ కార్యదర్శి మోహన్‌రెడ్డి, బీసీ జిల్లా కార్యదర్శి పివి రమణ, గోటూరు నాగభూషణం, అలవలపాడు రామసుబ్బారెడ్డి, మైనార్టీ నేతలు మహబూబ్ షరీఫ్, మెకానిక్ బక్షు, ఇలియాస్, శివయ్య పాల్గొన్నారు.

## 'కోర్టు ఆర్డరు ఉన్నా దౌర్జన్యం చేస్తున్నారు'

పెండ్లిమర్రి, జనవరి 25: తుమ్మలూరు గ్రామంలో 683-1 సర్వే నెంబర్‌పై కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఉన్నప్పటికి దౌర్జన్యంగా వేరొకరికి సొంత చేశారని తొట్ల వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి అన్నారు. గురువారం ఆయన విలేకరులకు తెలియజేస్తూ తుమ్మలూరు గ్రామంలో సర్వే నెంబర్ 683-1లోని 14సెంట్ల స్థలం/భూమి మా పూర్వీకుల నుంచి మా ఆధీనంలో ఉండగా ఆ భూమి క్రమ విక్రయాల ద్వారాచేతులు మారుతూ వచ్చిందన్నారు. 09.0.2007న వెంకటరమణారెడ్డి అనే వ్యక్తి పలువురి దగ్గర విక్రయ దస్తావేజు/అగ్రిమెంట్ పొందామన్నారు. కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. కానీ పెండ్లిమర్రి ఎస్ఐ సిబ్బంది దౌర్జన్యంగా వైసీపీ అధికార పార్టీ అండతో మా ఆధీనంలో ఉన్న స్థలాన్ని మా దగ్గర ఉన్నకోర్టు ఆధారాలను కూడా చూడకుండా స్థలంలోని నాలుగు గడ్డివాములను దౌర్జన్యంగా తీసివేసి మా స్థలాన్ని వేరొకరికి సొంత చేసి వెళ్లిపోయారన్నారు. తమకు న్యాయం చేయా

# టీడీపీని ఆదరించండి

## బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నేతలు

ప్రొద్దుటూరు , జనవరి 25 : జగన్ ప్రభుత్వంలో సంక్షేమం కంటే ప్రజలపై పన్నుల భారం అధికంగా పడిందని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం సోముల వారి పల్లె ఈశ్వరరెడ్డి నగర్‌లో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి , నాగమునిరెడ్డి ,మాజీ సర్పంచ్ సాంబశివుడు, మాజీ ఎంపీటీసీ షేక్ షామీర్, రామకృష్ణారెడ్డి, పల్లెటి రాముడు, బాలయ్య, నాగేశ్వరావు, హరి, మనోహర్, గంగాధర్, కుమార్, అమ్మనక్క, విజయ్‌విక్టర్, చిన్న ఖాసీం నిజాం కళ్యాణ్ పాల్గొన్నారు.

**మైలవరం..:** మహిళలు అభివృద్ధి చెందాలంటే చంద్రబాబుతోనే సాధ్యమని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి తల్లి సరస్వతి అన్నారు. గురువారం మండలపరిధిలోని రేగడిపల్లి, కల్లుట్ల గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో బాగంగా ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొండయ్య, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి సూర్యపెద్దిరాజు, మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి, మండల నాయకులు రాజారెడ్డి, పాపిరెడ్డి, నారాయణరెడ్డి, పురుషోత్తంరెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, గంగరాజు, గిరిజారెడ్డి, నాగేశ్వరరావు, సుబ్బరాయుడు, ప్రసాద్, అరుణ్ వర్దన్ రెడ్డి, జర్మియా, రంగస్వామి, రాజశేఖర్‌రెడ్డి, రంగస్వామిరెడ్డి, గురివిరెడ్డి, శ్రీరాములు, కిట్టు, హరి తదితరులు పాల్గొన్నారు.

**ఎర్రగుంట్ల..:** మండల పరిధిలోని టి.సుంకేసులతో బాబు ష్యూరిటి భవిషత్తు గ్యారెంటీ కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. గ్రామంలో జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు ఈకార్యక్రమంలో మండల ఇన్‌చార్జి జయరామిరెడ్డి, మోహన్‌రెడ్డి, సుంకేసుల గ్రామనాయకులు మల్లికార్జునరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఈశ్వరయ్య, వెంకటరమణ, తిరుపాల్ లోకేష్, శ్రీనివాసులు, మునిశేఖర్‌రెడ్డి, జనసేన కన్వీనర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

● **బీసీలకు టీడీపీ అండ..:** బీసీలకు టీడీపీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎర్రగుంట్ల టీడీపీ కార్యాలయం వద్ద జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీకి మండల బాధ్యుడు మోహన్‌రెడ్డి, బీసీ నాయకులు లాయర్‌గుర్రప్ప, సుంకరనాగేశ్వరరావు, రామక్రిష్ణ, జనసేన జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

**బద్వేలు టౌన్..:** తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సూపర్‌సిక్స్ పథకాలను పార్టీలకతీతంగా అందిస్తామని మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 17వ వార్డు, 36వ వార్డులోని శ్రీకృష్ణదేవరాయనగర్, గాండ్లవీధి, రెడ్డయ్యమఠం వీధి, పోరుమామిళ్ల మెయిన్ రోడ్డులో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ప్రధాన కార్యదర్శి మిత్తికాయల రమణ, రామక్రిష్ణ, సూరి, ప్రసాద్, సుదర్శన్, రామయ్య, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

**పోరుమామిళ్ల..:** ఎన్నికల మేనిఫెస్టో పథకాలకు సంబంధించిన కరపత్రాలు బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న పంపిణీ చేశారు. గురువారం పోరుమామిళ్లలోని పాత పోస్టాఫీసు వీధి 13వ వార్డుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.రామసుబ్బారావు, సీతా వెంకటసుబ్బయ్య, ఇమాంఉసేన్, సెట్టిం ప్రతాప్; ప్రొఫెసర్‌బాషా, మస్తాన్, షరీఫ్, డ్రైవరు మహబూబ్‌బాష, సంచర్ల మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, ప్రొఫెసరు బాషా, అన్వర్, దానం, సత్యరాజ్ తదితరులు పాల్గొన్నారు. కాగా గురువారం బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న సతీమణి అరుణ రాజీ ప్రచారం నిర్వహించారు. గురువారం రంగసముద్రం పంచాయతీ పరిధిలోని మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచుతూ టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హబీబున్నీసా పాల్గొన్నారు.

**కాశినాయన..:** వచ్చే సాధారణ ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని బద్వేల్ టీడీపీ యువనేత కే.రితీష్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం బద్వేల్ టీడీపీ ఇన్‌చార్జి బొజ్జా రోశన్నతో కలిసి కొండ్రాజుపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కాగా గత కొంతకాలం క్రితం కొండ్రాజుపల్లెలో అనారోగ్యంతో మృతిచెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ఎంకోజీరావు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు రాజారెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు రవీంద్రారెడ్డి క్లస్టర్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్‌రెడ్డి, ఎల్.చెన్నారెడ్డి,బయపురెడ్డి, వెంకటేశ్వర్లు,మానందిరెడ్డి,నర్శిరెడ్డి,లక్ష్మీరెడ్డి,నాగిరెడ్డి,వేణుగోపాల్‌రెడ్డి,ఏ.రమణారెడ్డి,గురప్పడు,కేనారాయణరెడ్డి,రామచంద్రయ్య, వెంకటసుబ్బయ్యనరసింహారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.





ఎర్రగుంట్ల.. టీ.సుంకేసులలో ప్రచారం నిర్వహిస్తున్న భూపేశ్‌రెడ్డి



కాశినాయన... ప్రచారం నిర్వహిస్తున్న రితీష్‌రెడ్డి



పోరుమామిళ్లలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న రోశన్న

**బి.కోడూరు..:** మండల పరిధిలోని ఐత్రంపేట గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పత్రాలను మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రరెడ్డి, రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు రమణారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుగ్గిరెడ్డి, రాఘవరెడ్డి, బాలయ్య, పవన్, వెంకటసుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## టీడీపీ ఆత్మీయులంతా ఏకం కావాలి

ఎర్రగుంట్ల, జనవరి 25: టీడీపీ ఆత్మీయులంతా ఏకం కావాలని టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి సి.భూపేశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రాత్రి ఎర్రగుంట్లలో టీడీపీ నాయకుడు కల్లూరు శ్రీనివాసరెడ్డి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ పట్టుదలతో కృషిచేయాలన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీనాయకుడు సీఎం.సురేష్‌నాయుడు, మండల ఇన్‌చార్జి సి.జయరామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ వి.వెంకటశివారెడ్డి, టీడీపీ నాయకులు బయపురెడ్డి, గోపి, మండల బాధ్యుడు మోహన్‌రెడ్డి, నాగరాజునాయుడు, జంగంరెడ్డి, మాజీ సర్పంచ్ శివారెడ్డి, రాజారెడ్డి, కత్తిప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

## 'వైసీపీని సాగనంపుదాం'

ముద్దనూరు జనవరి25:బీసీలకు తీరని అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని టీడీపీ జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణంలో జయహో బీసీ సభ నిర్వహించారు. అందులో భాగంగా భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ బీసీలకు తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు శివరామిరెడ్డి, కుడుముల శశిధర్‌రెడ్డి, కుడుముల భాస్కర్‌రెడ్డి,అబ్దుల్‌ఖాదర్, బాబాఅమీర్,నాగరాజు, సాగర్‌బాబు,వినోద్‌కుమార్, మురళీ, రామాంజనేయరెడ్డి, కేశవరెడ్డి, జగదీశ్వరరెడ్డి, శేఖర్‌నాయుడు, రామసుబ్బారెడ్డి,ప్రసాద్‌రెడ్డి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జగన్ ఆసరా పేరుతో మహిళలకు టోకరా : లింగారెడ్డి

ప్రొద్దుటూరు టౌన్ జనవరి 25 : ఆసరా పథకం పేరుతో సీఎం జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు టోకరా వేస్తున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పసుపు కుంకుమ పేరుతో కోటి మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.10వేలు లబ్ధి చేకూరగా, జగన్ పాలనలో కేవలం 50 లక్షల మందికి రూ.15వేలు లబ్ధి చేకూరిందని తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక డ్వాక్రా సంఘాల నుంచి 35 లక్షల మంది ఎందుకు వైదొలగారో ప్రభుత్వం చెప్పాలన్నారు. డ్వాక్రా మహిళలకు ఇళ్లు కట్టిస్తామని డబ్బు వసూలు చేసి వైసీపీ నాయకులు స్వాహా చేశారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వస్తేమహిళలకు అండగా ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గుర్రప్ప, సిద్ధయ్య, మహబూబ్‌బాషా, రాము నాయుడు, భాస్కర్‌రెడ్డి, సుబ్బరాజు పాల్గొన్నారు.

## 'నిధులు కేంద్రానివి.. సోకులు రాష్ట్ర ప్రభుత్వానివా..?'

మైదుకూరు, జనవరి 25 : కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, నిధులు మంజూరు చేస్తుంటే మన రాష్ట్రంలో అవి తమ పథకాలు అని చెప్పుకునేలా పథకాలపై సీఎం జగన్ స్టిక్కర్లు వేసుకోవడం సిగ్గుచేటని బీజేపీ నియోజకవర్గ కన్వీనరు మాచనూరు సుబ్బరాయుడు పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రచారంలో భాగంగా గురువారం మైదుకూరులోని రాయల్ కూడలిలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రంగస్వామి , ఏవో లక్ష్మీ ప్రసన్న, నాయకుల బీపీ ప్రతాప్, ఏవీ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం

ప్రొద్దుటూరు , జనవరి 25 : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు గురువారం ఆయన స్వగృహంలో ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా టీడీపీ కార్యకర్తలు అభిమానులు రక్తదానం చేశారు. ప్రవీణ్‌రెడ్డి కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు వైఎస్‌జబీవుల్లా, కౌన్సిలర్ మహ్మద్ గౌస్, తాటి శ్రీను,విశ్వనాథరెడ్డి,బాబుల్‌రెడ్డి , బండి బాస్కర్‌రెడ్డి, గంగాధర్ లక్ష్మీనారాయణమ్మ, శ్రీదేవి, మేరువ మూర్తి పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో ప్రవీణ్‌రెడ్డి

## తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన

ప్రొద్దుటూరు,జనవరి 25 : అమృతనగర్‌లో పేదలకు 2018లో గత టీడీపీ ప్రభుత్వం ఇళ్ళపట్టాలిస్తే ఆ ప్రాంతంలో కనీసం రోడ్లు, విద్యుత్, తాగునీటి సదుపాయం లేక ఇంటి నిర్మాణాలు చేపట్టలేని పరిస్థితి ఉందని పేదలు వాపోయారు.గురువారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద పేదలు ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దారు నజీర్ అహ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు , లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అమృతనగర్‌లో సచివాలయం వద్దే స్థలాల ఆక్రమణ

ప్రొద్దుటూరు, జనవరి 25 : అమృతనగర్‌లో సచివాలయం నిర్మాణంకోసం లేఅవుట్‌లోని ఖాళీ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారని తహసీల్దారు నజీర్ అహ్మద్‌కు సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఫిర్యాదుచేశారు. గురువారం తహసీల్దారు నజీర్ అహ్మద్ పట్టాఇచ్చారని కొందరు వ్యక్తులు అక్రమంగా అమృతనగర్‌లో నిర్మాణాలు చేపడుతున్నారని శివచంద్రారెడ్డి తహసీల్దారు దృష్టికి తెచ్చారు.

## విద్యుదాఘాతంతో డ్రైవరు మృతి

కలికిరి, జనవరి 25: గుండ్లూరు కాలనీ సమీపంలో ఇళ్ల స్థలాల కోసం డోజర్‌తో భూమిని చదును చేస్తుండగా పైన వున్న 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి డ్రైవరు కల్యాణ్ (22) అక్కడికక్కడే మృతి చెందాడు. ఖాజీపేట మండలానికి చెందిన డ్రైవరు కల్యాణ్ విద్యుదాఘాతానికి మృతి చెందాడని విద్యుత్ శాఖ ఏఈఈ ముజిబుర్ రహ్మాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యుత్ లైను కింద ఎత్తులో ఉన్న మట్టిని చదును చేయడంతో వైర్లు తగిలాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తహసీల్దారు అవినీతి, అక్రమాలపై వరద ఆగ్రహం



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న వరద

ప్రొద్దుటూరు ,జనవరి 25 : ప్రొద్దుటూరు తహసీల్దారు నజీర్ అహ్మద్ అవినీతి అక్రమాలపై మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి పలు పట్టా భూములను వేరే వ్యక్తులకు అన్యాక్రాంతం చేయడపంపై వరదరాజులరెడ్డి నజీర్ అహ్మద్‌ను నిలదీశారు. లింగాపురంవద్ద తాళ్లమాపుం గ్రామపొలంలోని బాలాజీ కాలనీ లేఅవుట్ ప్లాట్లను అక్రమంగా వైసీపీ నాయకుడు కల్లూరు నాగేంద్రారెడ్డి బినామీలకు 9.45 ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేస్తావా అని నిలదీశారు. మరో 5.20 ఎకరాల ప్లాట్ల భూములకు ఆక్రమించినవారికి ఎట్లా పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తావన్నారు. గతంలో తహసీల్దారు వినాయకం ఇచ్చినట్లు ఒక ఫోర్జరీ పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తే దాని మీద రిజిస్ట్రర్ కార్యాలయంలో ఒక ఫేక్ డాక్యుమెంట్ పుట్టించుకున్నారన్నారు. ఆ ఫేక్‌డాక్యుమెంటును పరిశీలించి కూడా మీరు మరో పొజిషన్ సర్టిఫికెట్ ఎలా ఇస్తారన్నారు. దాన్ని బేస్ చేసుకుని సబ్ రిజిస్ట్రర్ రామలక్షుమ్మ కల్వరీ టెంపుల్ వారికి అక్రమంగా రిజిస్ట్రేషన్‌చేసిందన్నారు. తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రర్ ఎమ్మెల్యే ఇంట్లోకూర్చోని కోటి రూపాయల లంచాలు తీసుకొని ఈ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు.ఈ మూడేళ్ళలో ప్రొద్దుటూరుకు వచ్చి పదికోట్లు అక్రమాస్తులు కూడగట్టావన్నారు. నంగనూరు పల్లెలో 44 సెంట్లు భూమిపై ఆర్డీవో జేసీ కోర్టులో వివాదం వుంటే ఆ భూమిని అక్రమంగా ఆన్‌లైన్ చేస్తావా అని ప్రశ్నించారు. మైలవరం ఉత్తర కాలువకు సంబంధించి కల్లూరు లింక్ కెనాల్ ఎకరాల కొద్ది ఆక్రమిస్తే వాటిమీద చర్యలు తీసుకోవా అని ప్రశ్నించారు. తహసీల్దారు నజీర్ అహ్మద్ స్పందిస్తూ తాళ్ళమాపురం గ్రామ పొలంలోని భూములకు సంబంధిత వ్యక్తులకు అనుభవం సర్టిఫికెట్ మాత్రమే ఇచ్చానని టైటిల్ హక్కులు ఇవ్వలేదన్నారు. అక్రమంగా భూముల ఆన్‌లైన్‌లు తాను చేయలేదని ప్రతి దానికి డాక్యుమెంటు ఎవిడెన్స్‌వుందన్నారు. మైలవరంఉత్తర కాలువ లింక్ చానల్ కల్లూరు కాలువ ఆక్రమణలపై సర్వేచేసి నివేదిక కలెక్టరుకు పంపామన్నారు. ఇరిగేషన్ వారు ఆక్రమణలు తొలగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నంగనూరుపల్లె బాధితులు, భూములు అన్యాక్రాంతం కాబడిన బాలాజీ కాలనీ ప్లాట్ల యజమానులు ఉన్నారు.

## కౌన్సిలర్లకు గౌరవ వేతనాలు కూడా ఇవ్వకపోవడం దారుణం

జమ్మలమడుగు, జనవరి 25: జమ్మలమడుగు నగర పంచాయతీ కార్యాలయ సభాభవనంలో గురువారం 2024-25 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌పై సమావేశం జరిగింది. సమావేశంలో వైస్‌చైర్మన్-2 సింగరయ్య మాట్లాడుతూ కౌన్సిలర్లకు గౌరవ వేతనం కూడా ఇవ్వకపోవడం దారుణమని తెలియజేశారు. ఇందుకు సంబందించి వెంటనే కమిషనర్ మూడు రోజుల్లో గౌరవ వేతనం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ శివమ్మ,కౌన్సిలర్లు ముల్లాజానీ, పోచిరెడ్డి, బాణ శివరామలింగారెడ్డి, లక్ష్మీదేవి, షామీర్, ఎర్రన్న, కోఆప్షన్ మెంబర్లు గజ్జెల లక్షమయ్య, ఫయాజ్‌బాష పాల్గొన్నారు.

## కళాకారులకు నేడు గుర్తింపు కార్డుల పంపిణీ

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 25: కళాకారులకు గుర్తింపు కార్డులను శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తొగటవీర క్షత్రియ కళ్యాణమండపంలో పంపిణీ చేయనున్నట్లు ఏపీ నాటకఅకాడమీ డైరెక్టర్ బండారు లక్ష్మీదేవి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాకు వెయ్యి గుర్తింపు కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. ప్రొద్దుటూరు నియోజక వర్గానికి 100 మందికి పంపిణీ చేస్తామని తెలిపారు. రంగస్థల, చక్కభజన, కోలాటం, వీధినాటకం, తబలా, కీబోర్డు, హార్మోని, మిమిక్రీ తదితర కళాకారులకు గుర్తింపు కార్డులను అందచేస్తామన్నారు. ఎవరైనా కళాకారుడు గుర్తింపు కార్డుల కోసం 9849203829 నంబరుకు సంప్రదించాలని కోరారు. సమావేశంలో తొగటవీర క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, కోనేటి రామసుబ్బయ్య, కుమార్ పాల్గొన్నారు.

## జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

పోరుమామిళ్ల, జనవరి 25 : ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం జిల్లా అయిదో మహాసభలను ఈ నెల 28న ప్రొద్దుటూరులో నిర్వహిస్తున్నారని ఈ మహాసభలు జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు రమేష్, ఏఐటీయూసీ మండల అధ్యక్ష కార్యదర్శులు పీరయ్య పేర్కొన్నారు. గురువారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించారు.

## జాతీయ పర్యాటక దినోత్సవ ర్యాలీ

జమ్మలమడుగు, జనవరి 25: పర్యాటక ప్రాంతమైన గండికోట గ్రామంలో గురువారం జాతీయ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎస్. మల్లికార్జున, సర్పంచ్ ఈశ్వర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. గండికోట ఏపీ టూరిజం హోటల్ ఆవరణం నుంచి ర్యాలీగా వెళ్లి కోట ప్రాంగణంలోని చార్మినార్ వద్ద గండికోట పరిసర ప్రాంతంలో ర్యాలీ జరిగింది. అనంతరం ప్రొద్దుటూరు, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల, జమ్మలమడుగు సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు కోట ప్రాంగణంలో నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం స్వచ్ఛత డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నాగేశ్వరరెడ్డి, డ్వాక్రా సంఘాలు, గ్రామ మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.



గండికోట చార్మినార్ వద్ద స్టెప్‌లు వేస్తున్న విద్యార్థులు